క్లుప్తంగా

దుస్థితిలో మావిళ్లపాడు పశువైద్య కేంద్రం



పిచ్చిమొక్కలతో నిండిపోయిన పశువైద్య కేంద్రం

దొరవారిసత్రం : మావిళ్లపాడు గ్రామ పరిధిలోని పశువైద్య కేంద్రం దుస్థితిలో ఉంది. ఆవరణమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీని గురించి పశువైద్యులు, పంచాయతీ పాలకులు పట్టించుకోలేదు. భవనం చెందిన కిటికీలు దెబ్బతిన్నాయి. స్థానికంగా వైద్యులు, సిబ్బంది ఎప్పుడు ఉంటారో కూడా తెలియడంలేదని స్థానికులు తెలిపారు.

ఉత్తమ విలువలకు పురస్కారం



డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయరాలిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వాకాడు : ఇటీవల డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయని కొండా ప్రసన్నను గురువారం ఘనంగా సన్మానించారు. ఆమెను సేవా భావంతోపాటు విద్యార్థులకు తన దైన శైలిలో విద్యా బోధనలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రగతి సేవా సంస్థ వారు ఆమెకు డివిజన్ స్థాయిలో అవార్డు అందజేవారు. కార్యక్రమంలో హెచ్ఎం జాలాది కిషోర్, విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ షేక్ షకీనా, టి శ్రీనివాసులు, షేక్ రుబీనా, బి పావని, షబానా, హైమావతమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాల సేకరణలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గూడూరు రూరల్ : విజయవాడ ప్రాంతంలో వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని స్వర్ణాంధ్ర భారతి పాఠశాల విద్యార్థులు కోరారు. వారు గురువారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నవకోటినాయుడు, సునీల్‌రాజ్, హరిక్రిష్ణ, సింధు తదితరులు పాల్గొన్నారు.

రూ.65 వేల టపాసుల సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న టపాసులు

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామ సమీపంలో కేఆర్ కాంప్లెక్స్‌లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ.65 వేలు విలువైన టపాసులను గురువారం పోలీసులు సీజ్ చేశారు. కేఆర్ కాంప్లెక్స్‌లో టపాసులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు సీఐ సంగమేశ్వరరావుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీకాంత్ తమ సిబ్బందితో అక్కడ దాడులు చేశారు. ఈ క్రమంలో అనుమతి లేకుండా నిల్వ చేసిన టపాసులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.65 వేలు ఉంటుందని సీఐ సంగమేశ్వరరావు తెలిపారు. నిందితుడు గిరికుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరిలో ఈ నెల 25, 26వ తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పోలేరమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. అమ్మవారి ఆలయం, బజారువీధి, రాజావీధి, పాలకేంద్రం సెంటర్, క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి బారికేడ్లు, వాహనాలు పార్కింగ్, వసతుల కల్పనపై అధికారులకు సూచనలు చేశారు. ఈవో శ్రీనివాసులురెడ్డి, సీఐ ఏవీ రమణ పాల్గొన్నారు.

చెరువు పోరంబోకు భూమి ఆక్రమణకు యత్నం

కలువాయి: కలువాయి చెరువు పోరంబోకు భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు గురువారం అడ్డుకున్నారు. మాదన్నగారిపల్లి సర్వే నంబర్ 56లో కలువాయి చెరువు పోరంబోకు కింద 3 ఎకరాల భూమి ఉంది. దాన్ని ఆరె యాచేంద్ర ఆక్రమించుకుని సాగు చేసేందుకు ప్రయత్నాలు చేపట్టాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు తహసీల్దారు సంజీవకుమారికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు ఆర్ఐ మస్తాన్‌వలి, వీఆర్వో జనార్దన్ గురువారం అక్కడికి చేరుకుని భూమి ఆక్రమణను అడ్డుకున్నారు. పొలంలోకి మరోమారు వెళితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.


నాయుడుపేట మున్సిపల్ మేనేజర్ బదిలీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపల్ మేనేజర్ ఎంకె ఖాజామొహిద్దీన్‌ను శ్రీకాళహస్తి మున్సిపాలిటీ రెవెన్యూ అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఆయనను వార్డు సచివాలయ ఉద్యోగులు శాలువాలు కప్పి సత్కరించారు.

మరుగు ఏదీ..?



రాపూరులో శిథిలావస్థకు చేరిన బాలికల వసతి గృహం



రాపూరు బాలికల వసతి గృహంలోని వంటగదిలో పెచ్చులూడిన పైకప్పు

- బాలుర వసతి గృహంలో సౌకర్యాలు కరువు
- దుస్థితికి చేరిన బాలికల హాస్టల్ భవనం



రాపూరు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో తలుపులేని బాత్‌రూంలు, మరుగుదొడ్లు

రాపూరు: రాపూరులోని సమీకృత సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేవు. దీంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ హాస్టల్‌ను 2013 ఏప్రిల్ 1న అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఇక్కడ 3 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న 96 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలురు ఉన్నారు. 18 మరుగుదొడ్లు, 18 బాత్‌రూంలు ఉన్నాయి. ఒక్కదానికి కూడా తలుపులు లేవు. దీంతో బాలురు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఉన్నా మరమ్మతులకు గురైంది. మూడు బోర్లు ఉన్నా ఒకటి మాత్రమే పనిచేస్తోంది. అలాగే ఎస్సీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ 100 మంది బాలికలు చదువుతున్నారు. వంట గదిపై కప్పు ఊడి పడి కమ్మీలు కనిపిస్తున్నాయి. వర్షం వస్తే భవనం మొత్తం ఉరుస్తుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బాలికల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నారు.

తలుపులు ఏర్పాటు చేయాలి



మరుగుదొడ్లకు, స్నానపు గదులకు తలుపులు లేవు. దీంతో ఇబ్బంది పడుతున్నాం. తలుపులు ఏర్పాటుచేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. తలుపులు లేకపోవడంతో స్నానాలకు, మరుగుదొడ్డికి పోవాలంటే ఇబ్బందికరంగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తలుపులు ఏర్పాటుచేయాలి.

– దినేష్, 10వ తరగతి, రాపూరు

ఆర్‌వో ప్లాంట్ మరమ్మతులు చేయాలి



ఆర్‌వో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. దీంతో మంచి నీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. కొళాయి నుంచి వచ్చే నీటిని తాగుతున్నారు. ఆర్‌వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలి. చెడిపోయిన బోర్లను రిపేరు చేయించాలి. ఉన్న ఒక్క మోటారు మరమ్మతులకు గురైతే తీవ్ర మంచినీటి సమస్య ఏర్పడుతుంది.

– గణేష్, 10వ తరగతి, బాలుర వసతి గృహం రాపూరు

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్

సైదాపురం: మండలంలోని ఆర్‌వైజీపాళెం, మర్లపూడి పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ పరిశీలించారు. మస్టర్‌లో నమోదు చేసిన కూలీల సంఖ్య కంటే పనులు చేస్తున్న వారి సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పంచాయతీల్లో 70 మందికి పని కల్పించాల్సి ఉండగా 42 మంది మాత్రమే పని చేయడం సరికాదన్నారు. పని కోరిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించి హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు రూరల్ : నాయుడుపేట ప్రాంతంలోని మేనకూరు సెజ్‌లో ఉన్న లాయల్ టెక్స్‌టైల్స్‌ను యాజమాన్యం మూసేందని, అందులో పని చేసే కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. వారు గురువారం సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ లాయల్ టెక్స్‌టైల్స్‌లో సుమారు 600 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. యాజమాన్యం నష్టాలు వస్తున్నాయని సాకుగా చూపి మూసి వేసిందని తెలిపారు. అందులో పని చేసే కార్మికులు మరో చోట పని దొరక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం వారికి జీత భత్యాల బకాయిలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. సీఐటీయూ నాయకులు జోగి శివకుమార్, సురేష్, చంద్రయ్య, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

ఓజిలి: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వీఆర్వో డిల్లెయ్య తెలిపారు. ఆయన గురువారం తహసీల్దార్ పద్మావతి ఆదేశాల మేరకు మండలంలోని జోష్యులవారికండ్రిగలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమును స్వాధీనం చేసుకున్నారు. అందులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 113–2.73 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదులు అందడంతో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ, వాగు, మేత పోరంబోకు భూముల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఓజిలి: మండలంలోని మానమాల బాబా మందిరంలో భక్తులు సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హారతి, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్మాణకర్తలు ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, శోభారాణి నైవేద్యం సమర్పించారు. అనంతరం మేనకూరు గ్రామానికి చెందిన కట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సాయిసుజనా రెడ్డి అన్నదానం చేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కోట: పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మునికుమారి



సైదాపురం : మాట్లాడుతున్న సీడీపీవో సునంద

కోట: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీడీపీఓ మునికుమారి తెలిపారు. మండలంలోని చంద్రశేఖరపురంలో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలన్నారు. తద్వారా బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. శారీరక ఎదుగుదల ఎంతో బాగుంటుందని చెప్పారు. అనంతరం పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహారాన్ని తయారు చేయడంపై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, హెచ్ఎం వేణుగిణి, ఏఎన్ఎం నాగజ్యోతి, అంగన్‌వాడీ వర్కర్లు రమణమ్మ, మంజుల, కోటేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం : మహిళలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని రాపూరు సీడీపీవో సునంద తెలిపారు. ఆమె గురువారం సైదాపురం మండలంలోని ఓరుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 6 ఏళ్లలోపు పిల్లలు, తల్లులు, కిశోర బాలికల్లో రక్తహీనత ఏర్పడుతుందున్నారు. దాన్ని అధిగమించేందుకు ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెంబేటివారిపాళెంలో పౌష్టికాహార మాసోత్సవాలు

వాకాడు : మండలంలో రావిగుంటపాళెం పంచాయతీ చెంబేటివారిపాళెంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలను వివరించారు. అనంతరం పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రదర్శించారు. అంగనవాడీ సిబ్బంది పద్మ, వసంతమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

గూడూరు రూరల్ : గర్భిణులు క్రమంతప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోని విగ్నేశ్వరపురం సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గర్భిణులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోతే ప్రసవ సమయంలో రక్త హీనత ఏర్పడి కాన్పు కష్టమవుతుందన్నారు. ఆకు కూరలు, కూరగాయలు బాగా తినాలని సూచించారు. కార్యక్రమంలో సైపర్‌వైజర్ చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాకాడు : పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



గూడూరు రూరల్ : గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

నేటి నుంచి సుబ్రమణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలోని శత స్తంభ మండపం

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి 9 రోజులు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆడి కృత్తిక అనంతరం మాయూర ఆగమున శాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు వాసులకు తిరుగుడు మల్లాంగా పేరొందిన ఈ గ్రామంలోని స్వయంభువు సుబ్రమణేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. స్వామి కల్యాణం రోజు సుమారు 100 జంటల వరకు పెళ్లిళ్లు చేసుకుంటారు. ఈ ఏడాది కూడా ఆలయ ఈవో శశాంక్ అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపడుతున్నారు. చోళ రాజుల కాలంలో నిర్మించిన ఈ ఆలయంలోని శత స్తంభ మండపాన్ని తంజావూరుకు చెందిన శిల్పి తూర్పు దిక్కుకు చెక్కి నిలిపాడు. అతని కుమారుడు తన ప్రియురాలికి శత స్తంభ మండపాన్ని చూపించేందుకు మండపానికి ఉన్న అశ్వాలకు ప్రాణ ప్రతిష్ట చేశాడు. దాన్ని తంజావూరుకు తరలించేందుకు దక్షిణ ముఖంగా ఉంచాడు. ఈ విషయం తెలుసుకున్న శిల్పి తన కుమారుడిపై ఆగ్రహం వ్యక్తం చేసి అశ్వాల కాళ్లు తెగనరికాడు. అందువల్లే తిరుగుడు మల్లాంగా పేరు వచ్చిందని కథ ఉంది. అలాగే గ్రామం చుట్టూ చెరువు ఉండడంతో అందులోని నీరు పంట పొలాలకు వెళ్లి తిరిగి చెరువులోకే రావడం వల్ల కూడా తిరుగుడు మల్లాం అనే పేరు వచ్చినట్టు పెద్దలు చెబుతుంటారు. స్వయంభువుగా వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామి ఈ ప్రాంతంలో తపస్సు చేస్తుండగా మల్లాశురుడు అనే రాక్షసుడు స్వామి వారు ఉండే పొదపై ఉన్న వెదురు బొంగును కత్తితో నరకడంతో స్వామి వారికి గాయమైందని, దీంతోనే ఈ గ్రామానికి మల్లాం అనే పేరు వచ్చిందనే నానుడి కూడా ఉంది. ఈ క్రమంలోనే స్వామి వారికి చేపట్టే బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం అంకురార్పణ, శనివారం ధ్వజారోహణం, 17వ తేదీ మల్లాసుర సంహారం, 18న రథోత్సవం, 20న కల్యాణ రాయబారం, 21న కల్యాణ తలంబ్రాలు, 22న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 23న అలకల తోపు, 24న ఊంజల్ సేవ చేపడతారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



కొత్తనాళ్లపాడు దగ్గర మెయిన్ విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

దక్కిలి : మండలంలోని కొత్తనాళ్లపాడు దళితవాడ (రామరాజుపల్లి)లో రోడ్డు పక్కన ఓ రైతు తోటలో విద్యుత్ మెయిన్ లైన్‌కు తీగలు అల్లుకున్నాయి. రానున్న వర్షాకాలంలో ఈ తీగలకు విద్యుత్ సరఫరా వస్తుందని, ప్రజలు, మూగ జీవాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఈ విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించాలని కోరుతున్నారు.

ఆన్‌లైన్ ద్వారానే లావాదేవీలు



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జ్ సమత

చిల్లకూరు : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఇకపై ఆన్‌లైన్ ద్వారానే లావాదేవీలు నిర్వహిస్తామని సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ సమత తెలిపారు. చిల్లకూరులోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆవరణలో గురువారం ఇన్‌చార్జ్ సీఈవో రామానాయుడు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిల్లకూరు పీఏసీఎస్‌లో కొంత మంది రైతులు సభ్యత్వాన్ని కొనసాగించడం లేదన్నారు. వారిని తొలగించేందుకు తీర్మానం చేసినట్టు తెలిపారు. నూతనంగా సభ్యులుగా చేరే వారితో పాటు పాత సభ్యుల ఆధార్‌ను తీసుకుని ఆన్‌లైన్ చేస్తున్నట్టు వివరించారు. దీని వల్ల ప్రతి రైతుకు ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చిల్లకూరు పట్టాభిరెడ్డి, సతీష్‌యాదవ్, వెంకటక్రిష్ణయ్య, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఆల్‌బెండాజోల్ మాత్రల పంపిణీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, అధికారులు

రాపూరు : ఈ నెల 17వ తేదీ నుంచి పిల్లలకు నులి పురుగుల నివారణ కోసం ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు వేపినాపి, రాపూరు పీహెచ్‌సీల వైద్యులు ప్రమీల రాజకుమారి, సుదర్శనం, ఎంపీడీవో ఎల్ ఏడుకొండలు తెలిపారు. వారు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మండలంలో 10,900 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. అందరితోనూ మాత్రలు మింగించాలన్నారు. దీని వల్ల కడుపులో నులి పురుగులు నశించి పిల్లలు రక్తహీనత నుంచి బయటపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నజీమున్నీసా, ఎంపీహెచ్ఈవో అబ్దుల్‌సలాం, సుప్రజ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యదనపర్తి, చవటపల్లికి బస్సు ప్రారంభం



యదనపర్తిలో బస్సును ప్రారంభిస్తున్న స్థానికులు

కలువాయి: పదేళ్లుగా బస్సు సౌకర్యం లేక కలువాయి మండలంలోని చవటపల్లి, యదనపర్తి గ్రామాల ప్రజలు పడుతున్న అవస్థలు గురువారం తీరాయి. ఈ గ్రామాలకు నెల్లూరు 1 డిపో అధికారులు గురువారం నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. పదేళ్ల క్రితం ఆ గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండేది. అప్పట్లో కొన్ని కారణాల వల్ల బస్సు సర్వీసును రద్దు చేశారు. అప్పటి నుంచి గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గురువారం నుంచి బస్సు సర్వీసును పునరుద్ధరించేలా చేశారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గురుదక్షిణామూర్తికి ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పలు అభిషేకాలు చేశారు. అనంతరం విశేసంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

రాపూరు : మండలంలోని గోనుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు చేశారు. వైద్య నిపుణుడు గురవయ్య మాట్లాడుతూ పాఠశాలలోని సుమారు 155 మందికి పరీక్షలు చేశామని తెలిపారు. వారిలో నలుగురికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్టు తెలిపారు. హెచ్ఎం నాగేంద్రప్రసాద్, ఆరోగ్య కార్యకర్త కృష్ణవేణి, ఆశాకార్యకర్తలు భాగ్యమ్మ, పార్వతి, ఉపాధ్యాయులు పరంధామయ్య, వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి దేవి, శేషగిరిరావు, వెంకటేశ్వర్లు, సుధాకర్, అనీల్‌కుమార్, షేక్, ఎం గౌష్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ



రైతులకు యాజమాన్య పద్ధతులపై సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు శ్రీనివాస్



రాజులకండ్రిగలో రోజాపూల తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సత్యవేడు: వరి సాగులో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు రాజుల కండ్రిగలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం(డీఆర్సీ)తిరుపతి–వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో యాజమాన్య పద్ధతిపై అవగాహన కల్పించారు. విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి, నారుమడులు, పొలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. వెద పద్ధతిలో వరిసాగు చేసిన రైతులు కలుపు యాజమాన్యం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వరిలో అధిక దిగుబడి సాధించడానికి యంత్రాలతో వరినాట్లు, కాలిబాటలు తీయడం, సూక్ష్మపోషకాలు, జింకుసల్ఫేట్, కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలోనే వేయడంతోపాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో శశిధర్‌రెడ్డి, (ఆత్మ,చిత్తూరు), ఏఓ మురళి, సర్పంచ్ ఎస్, సుజాత, గ్రామ వ్యవసాయ సహాయకులు స్వర్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.